క్లుప్తంగా

రైల్వే సమస్యలు పరిష్కరించండి



డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : రైల్వేపరమైన సమస్యలు పరిష్కరించాలని గుంతకల్ రైల్వే డీఆర్‌ఎం వినిత్ సింగ్‌కు డీఆర్‌సీసీయూ మెంబర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి మంగళవారం గుంతకల్ డీఆర్‌ఎం కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డిపల్లి రైల్వేస్టేషన్‌కు పూర్వ వైభవం కల్పించాలని కోరారు. ప్యాసెంజర్ రైళ్లకు స్టాపింగ్ కల్పించాలని, చెన్నై సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు రాజంపేట, రైల్వేకోడూరులలో స్టాపింగ్ కల్పించాలని విన్నవించారు. నందలూరు, ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్‌లలో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్ కల్పించాలన్నారు. అనంతరం పలు సమస్యలపై డీఆర్‌ఎంకు వినతిపత్రం అందించారు.

అభినందనల వెల్లువ



బొల్లినేనిని అభినందిస్తున్న కృష్ణారావు

రాజంపేట రూరల్ : శ్రీశైల దేవస్థానం పాలక మండలి సభ్యులు బొల్లినేని రామ్మోహన్‌నాయుడుని వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందనలు తెలిపారు. మండల పరిధిలోని మిట్టమీదపల్లి గ్రామంలోని తన స్వగృహానికి పాలక మండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మంగళవారం విచ్చేసిన బొల్లినేనిని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా కార్యదర్శి మిరియాల సురేఖ, పట్టణ అధ్యక్షులు జేవీ కృష్ణారావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శివ, నాయకులు ఇలియాస్, మిరియాల శివ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల బుట్టలో పడొద్దు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చంద్రమోహన్

వీరబల్లి (రాయచోటి టౌన్) : సైబర్ నేరగాళ్లు వేసే బుట్టలో పడొద్దని అత్యాశకు పోతే ఉన్నది ఊడిపోతుందని ఎస్‌ఐ చంద్రమోహన్ ఎలకచెట్టుపల్లె గ్రామ ప్రజలకు సూచించారు. మంళవారం రాత్రి సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు సెల్‌ఫోన్ ద్వారానే కాకుండా ఇతర మార్గాల ద్వారా అమాయక ప్రజలను బురిడీ కొట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో అధిక మొత్తంలో డబ్బులు ఆశపెట్టించి అకౌంట్‌లో ఉన్న డబ్బులు క్షణాలలో మాయం చేస్తున్నారని చెప్పారు. సెల్ ఫోన్‌లో వచ్చే మెసేజ్‌లకు స్పందించరాదని తెలియపరిచారు.

రామాయణంపై పోటీ పరీక్ష



పరీక్షను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు

చిట్వేలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రామాయణం గురించి పోటీ పరీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఏబీఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో వేమన సాహిత్యపీఠం ఈ పరీక్ష పోటీని జరిపారు. ఈ సందర్భంగా సాహితీ పీఠం బాధ్యులు సుభా, చంద్రబోస్‌లు మాట్లాడుతూ రామాయణం, భారతం, భాగవతం వంటి కావ్యాలు చదవడం వలన సమాజ భావాలు పెంపొంది సమసమాజ స్థాపన నిర్మాణంలో భాగస్వాములవుతామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వతంత్రబాబు, నాగార్జున, విజయలక్ష్మి, సుహాసిని, సునీత, పెంచల దాసు, శ్రీనివాస్, విశ్వనాథం, వెంకటసుబ్బయ్య, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

కాళీయమర్ధిని అవతారంలో లక్ష్మీజనార్దనస్వామి

రామసముద్రం : మండల కేంద్రంలో వెలసిన అతిపురాతన లక్ష్మీజనార్దనస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారు కాళీయమర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ అర్చకులు పార్థసారధిబట్టర్, కులశేఖర్‌బట్టర్‌లు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సంకీర్తనలు నిర్వహించారు.

దేశానికే ఆదర్శం వలంటీర్ వ్యవస్థ

- స్ఫూర్తిని నింపేందుకే వలంటీర్లకు పురస్కారాలు
- వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా

రాయచోటి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వలంటరీ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని డీఎస్ఆర్ కల్యాణ మండపంలో మున్సిపాలిటీ పరిధిలోని వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. మునిసిపాలిటీలో వలంటీర్లుగా సేవలందిస్తున్న 417 మందిని వారు అధికారులతో కలసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివక్ష, అవినీతికి తావు లేకుండా వలంటీర్లు పనిచేయాలని సూచించారు. వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలిచి ప్రజల మన్ననలను పొందాలన్నారు. ప్రభుత్వ పథకాలు చేరవేయడంలో వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పురస్కారాలతో వలంటీర్లు స్ఫూర్తిగా పనిచేయాలని చెప్పారు.

ఓట్లు అడిగే హక్కు వైఎస్‌ఆర్‌సీపీకే ఉంది

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ చెప్పిన దాని కన్నా ఎక్కువగా సంక్షేమం, అభివృద్ధి పనులు చేసింది కాబట్టే ధైర్యంగా ప్రజలను ఓట్లు అడుగుతున్నామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తాము గతంలో ఈ మంచి పనులు చేశాం ఇప్పుడు వస్తే ఫలానా పనులు చేయబోతామని చెప్పకుండా గతంలో ఓడిపోయాం ఇప్పుడు తమకు ఓటు వేయండని టీడీపీ అడుగుతుండటం సిగ్గుచేటన్నారు. రాయచోటిని జిల్లా కేంద్రంగా చేసుకున్నాక అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నామని తెలియజేశారు. ప్రజలకు కావాల్సిన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు.

అభివృద్ధే తమ విధానం

ఇప్పుడు జరగనున్న ఎన్నికలు ధర్మానికి, అధర్మానికి మధ్య జరుగుతున్నాయన్నారు. ధర్మం వైపు సీఎం జగన్, చంద్రబాబు వైపు అధర్మం, దుష్టచతుష్టయం ఉన్నారని అభిప్రాయపడ్డారు. చివరకు ధర్మమే గెలుస్తుందన్నారు. భూకబ్జాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్లు, పంచాయతీలు, రౌడీయిజం, అవినీతి, అక్రమాలు ఎప్పుడూ చేయమని ప్రోత్సహించమని, రాళ్లు, బాంబులు వేయడం వంటివి తమ సంస్కృతి కాదన్నారు. నిస్వార్థంగా, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తున్నామన్నారు. అభివృద్ధే తమ విధానమని, శాంతి తమ నినాదంగా ముందుకు పోదాం అని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమంతోనే నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్‌ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిమి హరూన్, షబ్బీర్, ఆసీఫ్ అలీఖాన్, ఫయాజ్ అహ్మద్, కొలిమి చాన్‌బాషా, రౌనక్, కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, పల్లా రమేష్, అన్నా సలీం, అల్తాఫ్, రియాజ్, బీసీ సెల్ విజయభాస్కర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రియాజుర్ రెహమాన్, ఇర్ఫాన్, గౌస్‌ఖాన్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ నవరంగ్ నిస్సార్, మాజీ కో–ఆప్షన్ సభ్యులు జాఫర్ అలీఖాన్, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, భాస్కర్, నేలపాటి వెంకటేష్, సాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, గంగిరెడ్డి, జావీద్, అమీర్, మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు నిర్లక్ష్య ధోరణి విడనాడాలి



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి లీలారాణి

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలోని బూత్ లెవల్ అధికారులు ఎన్నికల పట్ల నిర్లక్ష్య ధోరణి విడనాడి విధులు సక్రమంగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి లీలారాణి తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఎల్‌ఓలు ప్రలోబాలకు లోను కాకూడదని అన్నారు. ఎన్నికల నిర్వహణలో బీఎల్‌ఓలు కీలకమని ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఏవైనా తప్పులు జరిగితే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలియజేశారు. ఎన్నికల నియమావళిని పగడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలలో ఎలాంటి అల్లర్లు జరగకుండా ముందు నుంచే చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా ఎవరు పనిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు అమరేశ్వరి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు సిద్దేశ్వర రావు, ఆర్‌ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పుల్లంపేటకు ప్రభుత్వ విప్

పుల్లంపేట : మండలంలో జరిగే వలంటీర్లకు వందనం కార్యక్రమంలో బుధవారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు హాజరుకానున్నట్లు ఈఓపీఆర్‌డీ ప్రకాశం తెలిపారు. కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

వీరబల్లె (రాయచోటి టౌన్) : మండల కేంద్రంలోని బొక్కల గడ్డ సమీపంలో నూర్‌బీ అనే మహిళ మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆమె దహన సంస్కారాలకు ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని తెలియజేశారు.

మంచి ఫలితాలతో ఉజ్వల భవిష్యత్తు



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

లక్కిరెడ్డిపల్లె : మార్చిలో జరగబోవు పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్, పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం అందించడం ఒక వరమని, అందులోనూ అటల్ టింకరింగ్ మెకానికల్, ఒకేషనల్ విద్యలు అందిస్తున్నామన్నారు. ప్రతి పేద విద్యార్థి కష్టపడి చదివి మంచి పదవులు అలంకరించాలని చెప్పారు. జరగబోవు పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, నాటకాలు, సినిమా పాటలకు డ్యాన్సులు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగయ్య, అధ్యాపకులు నిత్యపూజయ్య, సుధాకర్, రాజ్ కుమార్, సుజాత, శ్రీనివాసులు, విజయ, విజయ్ కుమారి, అరుణ్ కుమార్, శ్రీకళ భారతి, ప్రసాద్, పీడీ సోమశేఖర్ నాయక్, సుధీర్, రసూల్, రాజేశ్వరి, సురేష్, ఉమామహేశ్వరి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దనే రేషన్ అందించాలి



తహసీల్దారు మురాషావలి

సిద్దవటం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రతి ఇంటికి నిత్యావసర వస్తువులు చేరవేసేందుకు చౌక దుకాణం డీలర్లు, ఎండీఎం ఆపరేటర్‌లు కృషి చేయాలని తహసీల్దారు మురాషా వలి ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం వీఆర్‌ఓలు, చౌక దుకాణం డీలర్లకు, ఎండీఎం ఆపరేటర్‌లకు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాలకు చెందిన తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ వారి ఇంటి వద్దకే వెళ్లి వాహనదారుడు, డీలర్ నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలన్నారు. అలాగే మండలంలో పెండింగ్‌లో ఉన్న పక్కాగృహాల సంబంధించి గృహాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మండలంలో ఇంటి నిర్మాణాల కోసం రుణాలు తీసుకున్న తరువాత కొందరు లబ్ధిదారులు నిర్మాణాలను చేపట్టలేదన్నారు. అలాంటి వారు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అనురాధ, వీఆర్‌ఓలు, డీలర్లు, ఎండీఎం ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఉద్యాన కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని అసోసియేట్ డీన్ డాక్టర్ గోపాల్ ప్రారంభించారు. 32 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్టు కళాశాల అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సార్లు రక్తదానం చేయడానికి విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం ప్రాణదానంతో సమానం అన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతో మంది మృతి చెందుతున్నారన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒక్కసారి రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం చేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ దీప్తి కిరణ్, డాక్టర్ నిశ్చల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలో ఒరిగిందేమీ లేదు



మలిశెట్టి వెంకటరమణ

చిట్వేలి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర కనీస వేతన సవరణ చట్టం బోర్డు మెంబర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మలిశెట్టి వెంకటరమణ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మహిళలకు మాయ మాటలు చెప్పి నమ్మించేందుకు చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. నవరత్నాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ సమన్యాయం చేసిన జగనన్నను ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన తెలియజేశారు.

వలంటీర్లు సైనికుల్లా పని చేయాలి



వలంటీర్ల సన్మానంలో ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి, అధికారులు తదితరులు

వీరబల్లె (రాయచోటి టౌన్) : ప్రతి వలంటీర్ సైనికుడిలా పని చేయాలని వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ రెడ్డి సూచించారు. మంగళవారం వంగిమళ్ల గ్రామంలోని గ్రామ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు సంధానకర్తలుగా వలంటీర్లు సేవ చేశారన్నారు. దీంతో మీపై సీఎం జగనన్నకు ఎంతో నమ్మకం కలిగిందని చెప్పారు. ఆయన మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సేవలందించాలన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం నుంచి అందించిన సంక్షేమాన్ని వివరించాలన్నారు. రాబోయే ఎన్నికలకు వలంటీర్లు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జగనన్నను మనం మరో మారు సీఎంగా చేసుకొనే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం వలంటీర్లను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, సురేంద్రారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె వన్ డిపో రీజియన్‌లో మొదటి స్థానం

మదనపల్లె సిటీ: అన్నమయ్య రీజియన్ పరిధిలో మదనపల్లె–1 డిపో కెఎంపిఎల్, ఓఆర్ సాధనలో మొదటి స్థానం నిలిచినట్లు డీఎం మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక డిపో కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈనెలలో కెఎంపిఎల్‌లో 5.45, ఓఆర్ 66 శాతం సాధించినట్లు తెలిపారు. సిబ్బంది సమష్టి కృషితో సాధించినట్లు పేర్కొన్నారు. ఆదాయం పెంచి డిపోకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సీఐ గీత, ఎంఎఫ్ రవి పాల్గొన్నారు.

క్లౌడ్ కంప్యూటింగ్‌లో అపార అవకాశాలు

కురబలకోట : ప్రపంచ వ్యాప్తంగా అనేక సాఫ్ట్‌వేర్ కంపెనీలు క్లౌడ్ కంప్యూటింగ్ సేవలను విరివిగా వినియోగిస్తున్నందున ఇందులో అపార అవకాశాలు ఉన్నాయని చెన్నై అడమ్స్ బ్రిడ్జ్ గ్లోబల్ సీనియర్ మేనేజర్ డి. ఆనంద్ స్వరూప్ పేర్కొన్నారు. అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో క్లౌడ్ కంప్యూటింగ్‌పై మూడు రోజుల పాటు హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్‌ను నిర్వహించారు. మంగళవారం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆకర్షణీయమైన కెరీర్ ఆప్షన్లలో క్లౌడ్ కంప్యూటింగ్ ప్రముఖంగా నిలుస్తోందన్నారు. వ్యాపారాలు, ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచటంలో భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా టెక్నాలజీని తీసుకు రావడంలో ఇది కీలక పాత్ర వహిస్తోందన్నారు. అపరిమితమైన ఉద్యోగ అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. క్లౌడ్ కంప్యూటింగ్‌లో తక్కువ స్థలంలో ఎక్కువ సమాచారాన్ని సురక్షితంగా నిల్వచేయవచ్చన్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సమాచార వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించవచ్చన్నారు.

సేవా వారధులు వలంటీర్లు

- కరోనా సమయంలో వలంటీర్ల సేవలు ఎనలేనివి
- వలంటీర్‌లను కించపరిచిన బాబు, పవన్‌లకు బుద్ధి చెప్పేలా పని చేయండి
- వలంటీర్లకు వందనంలో విప్ కొరముట్ల, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ అజయ్‌రెడ్డి



ఓబులవారిపల్లె: సేవా వజ్ర అవార్డును అందిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల, అజయ్‌రెడ్డి, సాయికిషోర్‌రెడ్డి

ఓబులవారిపల్లె : ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా వలంటీర్‌లు పని చేస్తున్నారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కొరముట్ల, ఏపీ స్కిల్ డెవలెప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డిలు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలను తీసుకొచ్చారన్నారు. అలానే వలంటీర్ల వ్యవస్థను ప్రారంభించి ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేశారన్నారు. కోవిడ్ సమయంలో వలంటీర్ల సేవలు ఎనలేనివన్నారు. కరోనా కారణంగా దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు రాష్ట్ర ప్రజలకు పథకాల రూపంలో సీఎం జగన్ లబ్ధిని చేకూర్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడేది వైఎస్ జగన్ అయితే, ప్రజలను నమ్మించి మోసం చేసేది చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. వలంటీర్ వ్యవస్థను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు వలంటీర్లు తగిన బుద్ధి చెప్పేలా ఎన్నికల్లో పని చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక ఎల్లో మీడియా, దుష్టచతుష్టయం సాయంతో చంద్రబాబు విషపు రాతలు రాయిస్తున్నాడని తెలియజేశారు. చంద్రబాబు మాటలను, పచ్చ పత్రికల రాతలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. రాష్ట్ర స్కిల్ డెవలెప్‌మెంట్ చైర్మన్ అజయ్‌రెడ్డి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. గత ప్రభుత్వంలో 1వ తేదీన తెల్లవారకముందే లేచి పింఛన్ పుస్తకాలను పట్టుకొని గంటల కొద్ది లైన్‌లో వేచి ఉండాలన్నారు. నేడు మీ గడప వద్దకే పింఛన్ ఇస్తున్న నాయకుడు మన వైఎస్ జగన్ అని అన్నారు. ఎమ్మెల్యేగా కొరముట్ల శ్రీనివాసులును, ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని భారీ మెజార్టీలతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సాయికిషోర్‌రెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు తమ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులకు, నాయకులకు తెలియజేసి ఆదర్శంగా నిలవాలని చెప్పారు. అనంతరం జిల్లా వ్యవసాయ మండలి అధ్యక్షులు పంజం సుకుమార్‌రెడ్డి, ఎంపీడీఓ కుళ్లాయప్ప మాట్లాడారు. తదుపరి వలంటీర్లు ఎనుగుల రెడ్డయ్య, గూడూరు సురేష్, కొప్పల సంపూర్ణ, పోలి చెంగల్‌రాయుడు, ఆర్.లక్ష్మిదేవి, మౌనికలతోపాటు సేవ మిత్ర కింద 255 మందిని నగదు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల నాగమ్మ, సర్పంచ్ ఎస్పీ జయపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ 1 గూడూరు గౌరిశంకర్‌రాజు, వైస్ ఎంపీపీ 2 కొమ్మూరు సుమిత్ర, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సుంకేసుల రఫీ, సర్పంచ్‌లు లౌడి గంగురాజు, ఆళ్ల ఈశ్వర య్య, కో ఆప్షన్ మెంబర్ షేక్ మౌలానా, పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాలనను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యం



చిట్వేలి: అవార్డు గ్రహీతలతో ఎమ్మెల్యే తదితర నాయకులు

చిట్వేలి : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పాలనను చేరువ చేయడమే లక్ష్యంగా వలంటీర్ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు పరుస్తున్నారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎంపీపీ సభా భవనంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని వలంటీర్లకు సన్మానం చేశారు. కందుల దేవేంద్ర (పోల్లోపల్లి సచివాలయం), తుంగా ఈశ్వరమ్మ (మార్గోపల్లి సచివాలయం), సంబిత రాము (చిట్వేలి సచివాలయం), మైలపల్లి సౌజన్య (మైలపల్లి సచివాలయం), సిద్దవటం హేమలత (రాజుకుంట సచివాలయం)లకు సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, పంజం సుకుమార్ రెడ్డి, ఎంపీపీ చంద్ర, మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, ఎల్‌వీ మోహన్ రెడ్డి, వెంకటరమణ, లింగం లక్ష్మికర్, ఎంపీడీఓ వెంకటరంగారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎంఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గానికి నియామక పత్రం అందజేస్తున్న ప్రభాకర్‌రాజు

రాజంపేట రూరల్ : ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తాలూకా(ఏపీపీఎంఈఏ) యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లంకా మల్లేశ్వరరెడ్డి అధ్యక్షతన మంగళవారం కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం వై.ప్రభాకర్‌రాజు ఎన్నికల నిర్వహణ అధికారిగా వ్యవహరిస్తూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్.హరిప్రసాద్‌బాబు, ఉపాధ్యక్షులుగా ఎస్.రెడ్డిబాషా, జనరల్ సెక్రటరీగా యు.కిరణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ ఏ.నాగరాజ, ట్రెజరర్ ఎస్.షాజహాన్, జిల్లా కౌన్సిలర్‌లుగా ఆర్.సల్మాన్‌రాజు, పి.పెంచలయ్య తదితరులు ఎన్నికైనట్లు తెలియజేశారు.

ఊపిరి పీల్చుకున్న రాచపల్లె గ్రామస్తులు

- రాచపల్లెను పీడిస్తున్న డెంగ్యూ జ్వరాలు
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి చొరవతో వైద్య సేవలు



గ్రామంలో వైద్య సేవలందిస్తున్న వైద్య బృందం

రాజంపేట రూరల్ : డెంగ్యూ జ్వరాలు సిద్దలపల్లి రాచపల్లి గ్రామాన్ని కొన్ని రోజులుగా పట్టి పీడిస్తున్నాయి. తాళ్లపాక పంచాయతీ పరిధిలోని సిద్దపల్లె రాచపల్లె గ్రామంలో దాదాపు 200లకు పైగా గృహాలు ఉన్నాయి. అందులోని ప్రతి గృహంలో ఒకరు లేక ఇద్దరికి డెంగ్యూ జ్వరం సోకడంతో గ్రామం మొత్తం మంచం బారిన పడింది. అక్కడి పరిస్థితిని గమనించిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చొప్పా ఎల్లారెడ్డి, దొడ్డిపల్లి భాస్కర్‌రాజులు రాచపల్లెలో ప్రబలిన జ్వర పీడుతుల బాధలను జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆకేపాటి ఆకేపాడులోని పీహెచ్‌సీ వైద్యులను అప్రమత్తం చేయడంతోపాటు ఎల్లారెడ్డి, భాస్కర్‌రాజులను పర్యవేక్షించాలని ఆదేశించారు. మంగళవారం ఆకేపాడు వైద్య సిబ్బంది పెద్ద ఎత్తున చేరుకున్నారు. అక్కడ ఉన్న రోగ పీడుతులకు వైద్య సేవలందించారు. వైద్య సేవలు సకాలంలో అందటంతో ఆ గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అదే సమయంలో పంచాయతీ సిబ్బందిని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అప్రమత్తం చేయడంతో గ్రామంలో వారు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వైద్య సేవలు అందించడంతోపాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి తోడ్పాటునందించిన జెడ్పీ చైర్మన్ ఆకేపాటికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

నెలవారీ నివేదికలు ప్రభుత్వానికి సమర్పించాలి

మదనపల్లె : ప్రైవేట్ ఆస్పత్రుల, స్కాన్ కేంద్రాల వైద్యులు, ల్యాబ్స్, డయాగ్నస్టిక్ కేంద్రాల సిబ్బంది రోజువారీ, నెలవారీ నివేదికలు ప్రభుత్వానికి ఇవ్వాలని జిల్లా పీసీపీఎన్‌డీటీ నోడల్ అధికారి, డీఐఓ డాక్టర్.ఉషశ్రీ అన్నారు. మంగళవారం మదనపల్లె జిల్లా ఆస్పత్రిలోని డీఈఐసీ హాల్‌లో మదనపల్లె డివిజన్ పరిధిలోని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కాన్ సెంటర్స్ వైద్యులు, ల్యాబ్స్, డయాగ్నస్టిక్ సిబ్బందికి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన నివేదికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఐఓ డాక్టర్ ఉషశ్రీ మాట్లాడుతూ.. ఏపీఏపీఎమ్‌సీఈ–2002 చట్టం, పీసీపీఎన్‌డీటీ చట్టం–1994 ప్రకారం ప్రైవేట్ ఆస్పత్రులు, స్కాన్ సెంటర్స్, ల్యాబ్స్, డయాగ్నస్టిక్ సెంటర్స్ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని నడపుకోవాలన్నారు. లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో ఉండాల్సిన కనీససౌకర్యాలు తాగునీరు, రోగులు వేచిఉండు గది, మరుగుదొడ్లు, వార్డులు, ఫైర్‌సేఫ్టీ, లిఫ్ట్, ర్యాంప్, పార్కింగ్‌ప్రదేశం తప్పక నిర్వహించాలని ఆదేశించారు. రోగులకు అందించే చికిత్సలకు బిల్లులు తప్పనిసరి అన్నారు. అలాగే చికిత్సలకు అందించే ధరలపట్టికను ఆస్పత్రి రెసెప్షన్ కౌంటర్‌లో ప్రజలకు కనపడేలా ఉంచాలన్నారు. డిప్యూటీ డెమో దేవశిరోమణి మాట్లాడుతూ..స్కాన్ సెంటర్స్‌లో గర్భస్థపిండ లింగ నిర్ధారణ చట్టం పోస్టర్స్, బ్యానర్లు కనపడేలా అతికించాలన్నారు. స్కాన్ చేయించుకున్నవారికి బిల్ తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. ఆరోగ్యమిత్రలు షిఫ్ట్ పద్ధతిలో అందుబాటులో ఉండాలన్నారు. డీఎస్ఓ కరీముల్లా మాట్లాడుతూ...రోజువారీ ఆస్పత్రిలో ఓపీ వివరాలు, ఐ.పీ. వివరాలు, కాన్పులు, అబార్షన్స్, సిజేరియన్ ప్రసవాలు, మాతాశిశుసంరక్షణ సేవలు, కుటుంబనియంత్రణ పద్ధతులు, ల్యాబ్‌టెస్ట్‌లు, జనన,మరణాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇప్పటికే పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల ద్వారా వారి పరిధిలోని ఆస్పత్రుల ల్యాబ్స్, స్కాన్ సెంటర్స్ వివరాలు సేకరించామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మీ, జిల్లా అంటువ్యాధుల పర్యవేక్షకులు వెంకటేష్, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, ఎన్‌జీఓ నిర్వాహకురాలు లలిత, హెల్త్ ఎడ్యుకేటర్స్ మహమ్మద్‌రఫీ, రాజగోపాల్, ఉష, సిబ్బంది అమర, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంగళ్లులో నేటి నుంచి ఉరుసు

కురబలకోట : మండలంలోని అంగళ్లులో రెండు రోజుల పాటు హజ్రత్ సయ్యదినా షేఖ్ అబ్దుల్ ఖాదర్ జిలాని పీరా నెపీర్‌గౌసుల్ అజం దస్తగిర్ వారి ఉరుసు ఉత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం రాత్రి గంధం వేడుకలు జరుగుతాయన్నారు. కడప దర్గా గురువు హజ్రత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరీఫుల్లా మహమ్మద్ ఫాతేహా ఖ్వానీ నిర్వహిస్తారన్నారు. గురువారం రాత్రి ఖవ్వాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.